## క్లుప్తంగా

### హెచ్ఐవీపై అవగాహన

టెక్కలి: హెచ్ఐవీ రోగుల పట్ల చిన్నచూపు తగదని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ జిల్లా రిసోర్స్‌పర్సన్ హెచ్.నాగభూషణరావు అన్నారు. హెచ్ఐవీ వ్యాప్తి, నివారణ తదితర అంశాలపై శుక్రవారం టెక్కలి మదర్ థెరిసా జూనియర్ కళాశాల, బీఎస్ అండ్ జేఆర్ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ నిరంజన్, సిబ్బంది సుధాకర్, డి.రాణి, ప్రిన్సిపాల్ కె.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు నగదు బహుమతులు

పలాస : మండలంలోని బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన జడ్డే హిందు, చరిష్మా, ఎస్.అర్చనకు సామాజిక కార్యకర్త కిక్కర ఢిల్లీరావు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్.ఎం.సి. చైర్మన్ గర్తం తులసీరావు, హెచ్ఎం వీర్రాజు, బొడ్డు దుశ్యంత్, పత్తిరి తాతారావు, తామాడ త్రిలోచనరావు, బొడ్డు సింహాద్రి పాల్గొన్నారు.

### కుక్కదాడిలో బాలుడికి గాయాలు

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు శ్రీనివాస్‌నగర్‌లో శుక్రవారం హరిఅక్షిత్ పండా అనే బాలుడిపై వీధికుక్కదాడి చేసింది. తీవ్ర గాయాలు కావడంతో బాలుడిని పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. కాగా, కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేసినా స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కాశీబుగ్గలో అన్న క్యాంటీన్ ప్రారంభం


క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

కాశీబుగ్గ: కాశీబుగ్గలో అన్న క్యాంటీన్‌ను శుక్రవారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పేదవాడి ఆకలి తీర్చడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

### రుద్రమూర్తికి కళాశ్రీ పురస్కారం


సత్కారం అందుకుంటున్న లండ రుద్రమూర్తి

కాశీబుగ్గ: నటుడు, దర్శకుడు, రచయిత, ప్రవాసాంధ్ర కళా సారధి వజ్రపుకొత్తూరుకు చెందిన లండ రుద్రమూర్తి గుంటూరులోని బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర దేవాలయం ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో కళాశ్రీ జాతీయ పురస్కారం అందుకున్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

### వైభవంగా సింహ సంక్రమణం పూజలు


స్వేచ్ఛావతి అమ్మవారు

ఇచ్ఛాపురం: గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారికి శుక్రవారం సింహసంక్రమణ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ప్రత్యేక హోమాలు అనంతరం అన్నదానం నిర్వహించారు.

### చిన్ననీలావతిలో వైద్యశిబిరం


వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

పలాస: మండలం చిన్ననీలావతి గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో కొందరు విషజ్వరాలతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న జెమ్స్ ఆసుపత్రి వైద్యులు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సాౖర పద్మ, సాౖర తిరుపతిరావు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# రావమ్మా.. వరలక్ష్మీ!


కాశీబుగ్గ: పలాసలో వరలక్ష్మీ దేవికి పూజలు


ఇచ్ఛాపురం రూరల్: పూజలందుకుంటున్న లక్ష్మీదేవి


వజ్రపుకొత్తూరు: వరలక్ష్మీదేవికి పిండి వంటల నైవేద్యం


టెక్కలి : జగద్ధాత్రిదేవి ఆలయంలో కుంకుమ పూజలు

పవిత్ర శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ప్రతి ఇంటా లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంగారు ఆభరణాలు, గులాబీ, చేమంతి పూలతో అందంగా అలంకరించారు. రకరకాల పిండి వంటలతో నైవేద్యం పెట్టారు. అనంతరం ఆలయాలకు అమ్మవారిని దర్శించుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్


కోటబొమ్మాళి: కొత్తమ్మతల్లి గుడిలో పూజలు చేస్తున్న దృశ్యం


వజ్రపుకొత్తూరు రూరల్: పూజలందుకుంటున్న వరలక్ష్మీ అమ్మవారు


వజ్రపుకొత్తూరులో వరలక్ష్మీపూజలు


కవిటి: లోళ్లపుట్టుగ కల్యాణవేంకటేశ్వర ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు


కోటబొమ్మాళి: లక్ష్మీగణపతి ఆలయంలో పూజలు

# గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయం

కాశీబుగ్గ/సోంపేట: పేదల ఆశాజ్యోతి సర్దార్ వల్లబాయ్ పటేల్ అని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శుక్రవారం గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా పలాసలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మందస మండలం హరిపురంలో లచ్చన్న విగ్రహానికి స్థానిక నాయకులు పూలమాలలు వేశారు. ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వజ్జ బాబూరావు, పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, దడియాల నర్సింహులు, అంబటి కృష్ణమూర్తి, కొరికాన శంకర్, సవర రాంబాబు పాల్గొన్నారు. సోంపేట పట్టణంలోని సామాజిక ఆసుపత్రి వద్ద సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. జెడ్పీటీసీ తడక యశోద, పలాసపురం సర్పంచ్ తడక జోగారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బొమ్మిడి ధర్మారావు, పాడుగు కామేష్, తోట ఢిల్లీరావు, దొండపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.


కాశీబుగ్గ: హరిపురంలో గౌతు లచ్చన్న విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు


గౌతు లచ్చన్న విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న జెడ్పీటీసీ యశోద

# ప్రతిభా అవార్డులు ప్రదానం

సంతబొమ్మాళి: మండలంలోని పాతమేఘవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు జిల్లా మత్స్యకార సహకార సంఘం డైరెక్టర్ సూరాడ జోగారావు శుక్రవారం షీల్డ్, నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం డి.వి.ప్రసాదరావు మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో 545 మార్కులు సాధించిన సుశీలకు రూ.3 వేలు, 543 మార్కులు సాధించిన చోడిపల్లి శివకు రూ. 2వేలు, 539 మార్కులు సాధించిన అర్జాల పూజ, సాయి దీపికలకు చెరో వెయ్యి రూపాయలు అందజేసినట్లు తెలిపారు. జోగారావు ఇదే పాఠశాలలో 15 ఏళ్లు సేవలందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి పరపటి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సూరాడ భీమారావు, ఉప సర్పంచ్ మంకు సింహాచలం, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ గాడి లక్ష్మి, యూత్ లీడర్ యంపల్ల దుర్గాప్రసాద్, మత్స్యకార నాయకులు సిరిగిడి రాము, నందుపిల్లి రామారావు, మండల తెలుగు యువత కార్యదర్శి దీర్ఘాశి జయరాం, సీఆర్‌పీ ఏ.తేజారావు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, దుర్యోధన, శివజ్యోతి, వైస్ చైర్మన్ సి.హెచ్. చెంచయ్య, సూరాడ అప్పలకొండ పాల్గొన్నారు.


విద్యార్థులకు షీల్డ్, నగదు అందజేస్తున్న సూరాడ జోగారావు

## భక్తిరంజని కార్యక్రమానికి ఇచ్ఛాపురం కళాకారులు


సంగీత కళాకారులు

ఇచ్ఛాపురం: తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ఈ నెల 19న శ్రావణరాఖీ పౌర్ణమి సందర్భంగా నిర్వహించే శ్రీవేంకటేశ్వర భక్తి రంజిని కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఇచ్ఛాపురం సంగీత కళాకారులు చిన్నా గురుస్వామి, జయలక్ష్మి పట్నాయక్, మాస్టర్ వెంకటరావు, సుమలత, గుణవతి, దనపాన హైమావతి, లనపాన కుమారీ, కీబోర్డు, తబలా కళాకారులు హేమంత్ బాడిత్య, నిత్యానంద బాడిత్యలకు లభించిందని శ్రీవేంకటేశ్వర డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ అధ్యక్షుడు చిన్నా గురుస్వామి తెలిపారు. వీరికి స్థానికులు శుక్రవారం అభినందనలు తెలిపారు.

# శ్రీశయన విద్యార్థులకు ఉపకార వేతనాలు

సోంపేట : సేవాభావమే జిల్లా శ్రీశయన సంఘ లక్ష్యమని ప్రముఖ వైద్యుడు ఆనింగి రామకృష్ణ, ఎస్ఎస్ ఫౌండేషన్ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు అన్నారు. జిల్లా శ్రీశయన సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీశయన సంఘ భవనంలో శ్రీశయన విద్యార్థులకు శుక్రవారం ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 75 గ్రామాల్లో పదో తరగతిలో 500 మార్కులు సాధించిన 60 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించినట్లు చెప్పారు. అంతకుముందు గౌతు లచ్చన జయంతి వేడుకలు నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంఘ అధ్యక్షుడు లొట్ల దీనబంధు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు బీన ఆనంద్, పొందూరు తిరుపతిరావు, పాడుగు కామేష్, బొమ్మిడి ధర్మారావు, తాతయ్య, హేమారావు, తట్ట షణ్ముఖరావు, కొర్నాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


ఉపకార వేతనాలు అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

## సామాజిక అంశాలపై అవగాహన


మాట్లాడుతున్న ఎస్ఐ అనిల్‌కుమార్

కాశీబుగ్గ: నృత్య ప్రదర్శనలతో సామాజిక అంశాలపై పట్ల అవగాహన కల్పించడం అభినందనీయమని మందస ఎస్సై అనిల్‌కుమార్ అన్నారు. స్వాతంత్ర వేడుకల్లో భాగంగా శుక్రవారం హరిపురం గ్రామానికి చెందిన చిన్నారులు రోడ్‌షో ఏర్పాటు చేశారు. రైతులు, ట్రాఫిక్ కంట్రోల్, ఆర్మీ, మద్యనిషేధం, మొక్కల పెంపకం తదితర అంశాలపై నృత్య ప్రదర్శన చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు భావన దుర్యోధన, లబ్బరు రుద్రయ్య, విశ్రాంత ఆర్మీ ఉద్యోగులు భావన పద్మనాభం, పురుషోత్తం, జీజే కాలేజీ లెక్చరర్ జి.వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

## పలాసపురంలో 'వృక్షాబంధన్'

సోంపేట: మహావృక్షాలను కాపాడటం పౌరుల బాధ్యతని పర్యావరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ యారడి కృష్ణమూర్తి అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా పలాసపురంలో పర్యావరణ పరిరక్షణ సంఘం, మత్స్యకార ఐక్యవేదిక ఆధ్వర్యంలో వృక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. పురాతన చెట్లకు రాఖీలు కట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ బిష్ణోయ్ తెగవలె చెట్లు కాపాడుకోవాలన్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని మనం కూడా మొక్కలు నాటి చెట్లు రక్షించాలన్నారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ సంఘం, మత్స్యకార ఐక్యవేదిక నాయకులు బార్ల సుందరరావు, బి.శంకరరావు, సత్యరాజ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


మహావృక్షాలకు పూజలు చేస్తున్న ప్రతినిధులు

## డిగ్రీ విద్యార్థుల ప్రతిభ

ఇచ్ఛాపురం: డిగ్రీ 4వ సెమిస్టర్ ఫలితాల్లో స్వర్ణభారతి విద్యార్థులు నియోజవకర్గస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారని చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. చల్లా లిఖిత (ఎంపీసీ) 9.41, బి.హర్షిత(ఎంపీసీ) 9.3, బి.కోమలి (బిజెడ్‌సీ) 9.2 పాయింట్లు సాధించారని చెప్పారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టెక్కలి రూరల్: బన్నువాడ పరిధిలోని బన్నువాడ, అయోధ్యపురం, ఎస్ఆర్‌కేపురం, దీపావళిపేట తదితర గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటలవరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని అధికారులు ఒక ప్రకటనలోతెలిపారు.

కంచిలి: కంచిలి, బి.పి. కాలనీ, బలియాపుట్టుగ, చిన్నపాత్రపడ, పెద్ద పాత్రపడ, భైరిపురం జంక్షన్, ఇండస్ట్రియల్ ఏరియా తదితర గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని సోంపేట డీఈఈ సీహెచ్‌వీ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

# సమన్వయంతో సమస్యల పరిష్కారం

ఇచ్ఛాపురం: ఆంధ్ర–ఒడిశా రాష్ట్రాల మధ్య నెలకొన్న సమస్యలను సమన్వయంతో పరిష్కరించుకోవాలని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. స్థానిక కంద్ర వీధి– ఒడిశాలోని సుమండి గ్రామాన్ని కలిపే రోడ్డును ఒడిస్సా చీకటి నియోజకవర్గ ఎమ్మెల్యే మనూ సామంతరాయ్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇరురాష్ట్రాల గ్రామాలన్నీ ఒకేచోట ఉండడంతో ఎవరూ పట్టించుకోక రోడ్లు పాడయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు కాళ్ల ధర్మారావు, కొండా శంకర్‌రెడ్డి, సాలిన ఢిల్లి, కాళ్ల దిలీప్, పత్రి తవిటయ్య, లీలారాణి పాల్గొన్నారు.


సమస్యలపై చర్చిస్తున్న ఎమ్మెల్యేలు

**దళిత కౌన్సిలర్‌కు అవమానం**

ఇచ్ఛాపురం రూరల్: ఆంధ్రా, ఒడిశా ఎమ్మెల్యేల సాక్షిగా ఓ దళిత వార్డు కౌన్సిలర్‌కు అవమానం జరిగింది. సమావేశంలో ఇద్దరు ఎమ్మెల్యేలకు చెరో పక్కన, ఎదురుగా వేసినా కుర్చీల్లో పలువురు టీడీపీ నాయకులు, కౌన్సిలర్లు కూర్చున్నా అధికార పార్టీకే చెందిన 4వ వార్డు కౌన్సిలర్ గేదెల శేఖర్ మాత్రం నిలబడే ఉండాల్సి వచ్చింది. ఈయన రెండు సార్లు టీడీపీ తరపున కౌన్సిలర్‌గా గెలిచినా..కేవలం దళితుడు కావడం వల్లే ఆయనకు కుర్చీ ఇవ్వలేదని దళిత సంఘాలతో పాటు తోటి కౌన్సిలర్లు విమర్శిస్తున్నారు.

# దీర్ఘకాలిక ప్రణాళికతో విపత్తుల నివారణ

టెక్కలి: దీర్ఘకాలిక ప్రణాళికలతో విపత్తులను నివారించవచ్చునని కెనడా థాంప్సన్ రివర్ యూనివర్శిటీకి చెందిన స్కూల్ ఆఫ్ సోషల్ వర్క్ అండ్ హ్యూమన్ సర్వీస్ ప్రొఫెసర్ బాలనిక్కు అన్నారు. 'ఇన్నోవేషన్ సొల్యూషన్స్ ఫర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ హ్యాండ్లింగ్' అనే అంశంపై శుక్రవారం టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూకంపాలు, వరదలు, అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు బాధితులను ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ఆదుకునే తీరు కేవలం తాత్కాలికమేనని పేర్కొన్నారు. దీనిపై దీర్ఘకాలిక ఆలోచన చేయాలన్నారు. బాధితుల శారీరక, మానసిక ఆరోగ్య పరిస్థితులపై దృష్టి సారించాలన్నారు. ఇందుకు ఇంజినీరింగ్ కళాశాలలు, విశ్వ విద్యాలయాలు ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థులు సాంకేతికంగా ఆలోచన చేయాలని కోరారు. అనంతరం బాలనిక్కును సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఐటీ హెచ్ఓడీ పి.రమేష్‌నాయుడు, జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


కెనడా ప్రొఫెసర్ బాలనిక్కును సన్మానిస్తున్న యాజమాన్యం

## పొలంబడి..అధిక దిగుబడి



పొలంబడి ద్వారా అందిస్తున్న సలహాలను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని సోంపేట సబ్ డివిజన్ ఏడీఓ పి.జగన్మోహనరావు అన్నారు. అంపురంలో శుక్రవారం నిర్వహించిన పొలంబడిలో వరి పైరులో జీవామృతం వినియోగం, కోనోవీడర్ ద్వారా కలుపు నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.ధనుంజయ, ఏపీసీఎన్ఎఫ్ సభ్యులు టి.శివానందం, కామరాజు, వీఏఏ మౌనిక పాల్గొన్నారు. -కంచిలి

# సమస్యల నిలయం.. బాలకృష్ణాపురం

ఇచ్ఛాపురం రూరల్: రెండు వేలకు పైగా జనాభా ఉండే బాలకృష్ణాపురంలో అపరిశుభ్రత తాండవిస్తోంది. ఏ వీధికి వెళ్లినా జుమ్మంటూ దోమలు స్వాగతం పలుకుతుంటాయి. తాగే మంచినీటి బోరు నుంచి నివాసం ఉండే ఇళ్ల వరకు మురుగునీరు పారుతునే ఉంటోంది. రాత్రి సమయంలో కరెంట్ పోతే చాలు దోమలు స్వైర విహారం చేస్తుంటాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో మురికి కాలువలు లేక వాడుక నీరంతా వీధుల్లోనే నిల్వ ఉంటోంది. దీంతో చిన్నలు నుంచి పెద్దలు వరకు జ్వరాల బారినపడుతున్నారు. పంచాయతీ తరఫున కనీసం దోమలు మందు పిచికారీ గానీ, బ్లీచింగ్ పౌడర్ చల్లడం గానీ చేయడంలేదని స్థానికులు విమర్శిస్తున్నారు.


తాగునీటి బోరు వద్ద మురుగునీరు నిల్వ


ఇంటి ముందే పేరుకుపోయిన చెత్తాచెదారాలు